సంపద సృష్టి.. సర్వం నాస్తి

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు
- చెత్త సేకరణలో చేతులెత్తేసిన పంచాయతీలు
- తడి, పొడి చెత్తను సేకరించేందుకు కూలీల కొరత
- రూ.కోట్ల ప్రజాధనం వృథా


గాడిలంకలో నిరుపయోగంగా మారిన డంపింగ్ యార్డు


ప్రధాన రహదారిపై పేరుకుపోతున్న చెత్త

ముమ్మిడివరం: చెత్త నుంచి సంపదను సృష్టించాలనే ఆలోచనతో గత టీడీపీ ప్రభుత్వం ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డులు నిర్మించింది. తడి, పొడి చెత్తను సేకరించి ఎరువుగా తయారు చేసి సంపద సమకూర్చుకోవచ్చునని అప్పటి ప్రభుత్వం చేసిన ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. విధి విధానాలు, స్పష్టమైన ప్రణాళిక లేకుండా ప్రభుత్వం చేపడుతున్న పనుల వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కావడంతో పాటు నిర్మించిన యార్డు షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడ వేయకుండా ఒక్క చోటకు చేర్చి తద్వారా చెత్త నుంచి సంపద సృష్టించాలనే ఆలోచన బాగానే ఉన్నా క్షేత్ర స్థాయిలో ఎంత వరకు సాధ్యమవుతుందో పట్టించుకోకుండా నిధులు ఖర్చు చేసేశారు.

ఎక్కడి చెత్త అక్కడే..

ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. కొన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులు నిర్మించినప్పటికీ రోడ్డు పైనే చెత్త పేరుకుపోతోంది. గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల కొరత ఉండటంతో వ్యర్థాలను తొలగించే పని చేపట్టలేకపోతున్నారు. చెత్త సేకరించి సంపద తేవడం దేవుడెరుగు.. కనీసం చెత్తను తొలగించే ఏర్పాట్లను సైతం చేపట్టకపోవడంతో ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయి దోమల తాకిడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు నిధులు సమకూర్చి పనులు చేసామని గొప్పలు చెప్పుకోవడమే తప్పా అవి ప్రజలకు ఉపయోగపడిన దాఖలాలు లేవు. వృథాగా ఖర్చు చేసిన నిధులను కనీసం వేరే పనులకు ఉపయోగించినా పేదలకు మేలు జరిగేదని పలువురు పేర్కొంటున్నారు.

రూ.7 లక్షల చొప్పున కేటాయింపు

నియోజకవర్గంలో 68 గ్రామ పంచాయతీలున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు అన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులు నిర్మించారు. ఒక్కొక్క డంపింగ్ యార్డుకు రూ.7లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ఈ లెక్కన సుమారు రూ.4.5 కోట్ల నిధులు వెచ్చించారు. నిధుల దుర్వినియోగం తప్పా ప్రజలకు ఒరిగిందేమీ లేదు. చెత్త సేకరించేందుకు వాహనాలు కూడా సమకూర్చ లేకపోయారు.

చెత్త పేరుకుపోతోంది

పంచాయతీలలో పారిశుధ్య సిబ్బంది లేక ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. గ్రామల ముఖ్య కూడళ్లలోని ప్రధాన రహదారులు, పంట కాలువల పక్కన చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దీంతో దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.


వడ్డి ఏడుకొండలు, సామాజిక కార్యకర్త, సుంకరపాలెం.

చెత్త సమస్య వీడింది..!


అల్లవరం పోలీస్‌స్టేషన్ వద్ద చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

సాక్షి ఇంపాక్ట్

అల్లవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ఏ వీధిలో చూసినా కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన చెత్త దర్శనమిస్తోంది. దీనిపై 'ప్రజారోగ్యంతో పరిహాసమా' శీర్షికన సాక్షి దినపత్రికలో మంగళవారం కథనం వెలువడింది. తక్షణం స్పందించిన అల్లవరం పంచాయతీ కార్యదర్శి రాజమోహన్ మంగళవారం ఉదయం నుంచి పారిశుధ్య కార్మికులతో పంచాయతీ పరిధిలో పేరుకుపోయిన చెత్తతో పాటు మండల పరిషత్ కార్యాలయంలో చెత్త కుప్పలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. వీరన్న మెరకలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచి శానిటేషన్ చేశామని కార్యదర్శి రాజమోహన్ తెలిపారు. పారిశుధ్య కార్మికులు అంతర్వేది ఉత్సవాలకు వెళ్లడంతో గ్రామాల్లో చెత్త పేరుకుపోవడం వాస్తమేనని, ఇక నుంచి విధిగా చెత్తను తొలగించి, డ్రైనేజీ నిర్వహణ సక్రమంగా ఉండేలా చూస్తామని రాజమోహన్ తెలిపారు.

క్రాస్‌బండ్ల ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశాలు


కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

ఉప్పలగుప్తం: రబీలో శివారు భూములకు సాగునీటి ఎద్దడి తలెత్తకుండా కాలువలు, డ్రైన్లపై అవసరమైన చోట క్రాస్‌బండ్లు (అడ్డుకట్టలు) ఏర్పాటు చేసే దిశగా తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేసి, నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. రబీలో సాగునీటి ఎద్దడితో కొన్ని చోట్ల రైతులు పడుతున్న ఇబ్బందులతో పాటు రానున్న రోజుల్లో ఎదుర్కొనే ఇబ్బందులను వివరిస్తూ 'అడ్డుకట్టలే ఆధారమాయే' శీర్షికతో సాక్షి దినపత్రికలో సోమవారం కథనం వెలువడింది. దీనిపై స్పందించిన కలెక్టర్ మహేష్ కుమార్ అమలాపురం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి అధికారులతో సమావేశమై సమీక్షించారు. రబీ సీజన్లో జిల్లాలో శివారు భూములకు సాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చోట్ల కాలువలు, డ్రెయిన్లపై క్రాస్‌బండ్లు (అడ్డుకట్ట) ఏర్పాటు చేసే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలిచ్చారు. జిల్లాలో అడ్డుకట్టలు అవసరమైన ప్రాంతాలను గుర్తించి ఫిబ్రవరి 14 లోపు నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. సాక్షి కథనంపై జిల్లా అధికారులు వెను వెంటనే చర్యలు తీసుకోవడం పట్ల రైతులు హర్షం వెలిబుచ్చారు.

గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలి

తాళ్లరేవు: భూమి గల ప్రతి రైతు ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్.ప్రశాంతి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా అందుబాటులోకి తీసుకువచ్చే ఉద్దేశ్యంతో ఈ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాలలో ఈ ప్రక్రియను ప్రారంభించడం జరిగిందన్నారు.

నేడు పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం

యానాం: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పుదుచ్చేరి బడ్జెట్ ముసాయిదా పై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు మంగళవారం స్పీకర్ ఆర్ సెల్వం తెలిపారు. దీనికి ముందుగా సమావేశాలు ఎన్ని రోజులు జరపాలనే విషయాన్ని బిజినెస్ రివ్యూ కమిటీ నిర్ణయిస్తుందని చెప్పారు.

పీడీఎఫ్ అభ్యర్థి గెలుపునకు సహకరించండి

ఎమ్మెల్సీ బొర్రా గోపీ మూర్తి


పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతివ్వాలని కోరుతున్న ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి

ఐ.పోలవరం: పీడీఎఫ్ బలపరిచిన ఉమ్మడి గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులను తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి పిలుపు నిచ్చారు. ఐ పోలవరం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కర్షకులు, నిరుద్యోగులు, ప్రజా సంఘాలు పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా నిలవాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ ఫైల్‌పై సంతకం చేసినా ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు.

గుండెపోటుకు అత్యవసర వైద్యం


కర పత్రాలను విడుదల చేస్తున్న కార్తీక్ రెడ్డి, సూపరింటెండెంట్ శంకరరావు

అమలాపురం టౌన్: గుండెపోటు వంటి విపత్కర పరిస్థితుల్లో సకాలంలో రోగికి అత్యవసర వైద్యం అందించాలని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ కె.కార్తీక్ రెడ్డి సూచించారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రితో పాటు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రూ.45 వేల విలువైన ఇంజక్షన్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఈ ఇంజక్షన్లపై మంగళవారం జరిగిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోనూ సిద్ధంగా ఉన్న టెనెక్టేప్లేస్ ఇంజక్షన్‌ను అత్యవసర హృద్రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకరరావు విజ్ఞప్తి చేశారు.
కార్యక్రమంలో ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ కె.అనూష, నర్సింగ్ సూపరింటెండెంట్ సీహెచ్. వెంకటలక్ష్మితో పాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, రోగులు పాల్గొన్నారు. ఇంజక్షన్ ప్రాధాన్యతను తెలిపే కరపత్రాలను విడుదల చేశారు.

పాఠశాలకు ఐడీబీఐ చేయూత


బ్యాంకు సిబ్బందిని సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలుర మరుగుదొడ్ల ఆధునీకరణకు ఐడీబీఐ (ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఆఫ్ ఇండియా) సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) సౌజన్యంతో పాఠశాలకు రూ.1.50 లక్షల నిధులను కేటాయించారు. ఈ మేరకు పాఠశాల హెచ్ఎం ఎన్.సత్యనారాయణకు బ్యాంకు సిబ్బంది చెక్కును అందించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు జగదీష్, సతీష్, నాగులపల్లి ప్రకాష్, ఎంపీటీసీ సభ్యులు నాగులపల్లి శేషవేణి, దేశంశెట్టి నాగరత్నకుమారి, ఎస్ఎంసీ చైర్మన్ గుర్లింక సూర్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన కోలాటం


కోలాటం ఆడుతున్న మహిళలు

తాళ్లరేవు: స్థానిక బాలాజీ నగర్‌లో అలమేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా నిర్వహించిన కోలాటం అందరినీ అలరించింది. గుణ్ణం వీర్రాజు ఆధ్వర్యంలో తాళ్లరేవు ముకుందా కోలాట బృంద సభ్యులు చేసిన కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ఉత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం చక్రస్నానం, గ్రామోత్సవం, రాత్రి పుష్పయాగం నిర్వహించారు.

సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించాలి

అల్లవరం: ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మోడలింగ్ అండ్ సిమ్యులేషన్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి అమెరికాలోని విస్కాన్సిన్-మాడిసన్ యూనివర్శిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ రుద్రరాజు శివ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు తగ్గట్లుగా విద్యార్థుల విద్యాభ్యాసం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐఐసీ అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ప్రవీణ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంచాలకులు బీవీ రామన్, వైవీ రమణమూర్తి, కేబీఎస్ శర్మ, ఆర్వీ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ డ్రైవర్ల వేతన వెతలు


టిప్పర్ డ్రైవర్ల యూనియన్ ప్రతినిధులతో పెండింగ్ వేతనాలపై చర్చిస్తున్న సత్తిబాబు

- మార్చి 6 నుంచి నిరసన బాట
- ఆ రోజు నుంచి ఇంటింటి చెత్త సేకరణ నిలుపుదల

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులతో కలిసి ఇంటింటా చెత్తను సేకరించే ఆటో టిప్పర్ డ్రైవర్లు వేతనాలు అందక మరోసారి తమ వెతలను వెళ్లబోసుకున్నారు. నవంబర్, డిసెంబర్ వేతనాలు సంబంధిత ఏజెన్సీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వక పోవడంతో టిప్పర్ డ్రైవర్లు మూడు రోజుల పాటు సమ్మె బాట పట్టిన సంగతి తెలిసిందే. మున్సిపల్ కమిషనర్ కేవీ ఆర్ఆర్ రాజు క్లీన్ ఆంధ్రప్రదేశ్ క్లీన్ (క్లాప్) డ్రైవర్స్ యూనియన్‌కు అనుబంధమైన ఏఐటీయూసీ నాయకులతో చర్చలు జరిపి ఎట్టకేలకు నవంబర్ నెల జీతం పడేలా చేయగలిగారు. ఇప్పుడు డిసెంబర్, జనవరి నెలలతో పాటు ఫిబ్రవరి సైతం సగం రోజులవుతున్న క్రమంలో ఆ డ్రైవర్లు మళ్లీ వేతనాల కోసం డిమాండ్ చేస్తున్నారు. ఈసారి మున్సిపల్ కమిషనర్ చెప్పినా వినేది లేదని, వచ్చే నెల మార్చి 5వ తేదీ లోపు వేతనాలు వేస్తే సరి లేకుంటే మార్చి 6వ తేదీ నుంచి పట్టణంలో ఇంటింటా చెత్త సేకరణ నిలిపివేసి నిరసన ఉద్యమం చేపడుతున్నట్లు టిప్పర్ డ్రైవర్ల యూనియన్ నాయకులు, ఏఐటీయూసీ ప్రతినిధులు స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు యూనియన్ నాయకులతో మంగళవారం తెల్లవారు జామున చర్చించి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు.

ఉద్యోగాల పేరుతో మోసగించిన వ్యక్తికి రెండేళ్ల జైలు

ముమ్మిడివరం: ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసగించి సొమ్ములు కాజేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధిస్తూ ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా మంగళవారం తీర్పు చెప్పారు. ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన జంపన గణేష్‌రాజు ముమ్మిడివరానికి చెందిన కొప్పిశెట్టి వీర వెంకట సత్యనారాయణతో పాటు మరికొంత మంది నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసి మోసగించాడు. ఈ మేరకు వీర వెంకట సత్యనారాయణ ముమ్మిడివరం పోలీసులకు జంపన గణేష్‌రాజుపై గతంలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిగా ఉన్న జంపన గణేష్‌రాజుపై నేరారోపణ రుజువు కావడంతో అతనికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు ఎస్సై జ్వాలాసాగర్ తెలిపారు.

బర్డ్ ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండాలి

అమలాపురం టౌన్: బర్డ్ ఫ్లూ వ్యాధి పట్ల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలో బర్డ్ ఫ్లూ కారణంగా లక్షల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క బర్డ్ ఫ్లూ కేసు కూడా నమోదు కానప్పటికీ అంతా ముందస్తు నివారణ చర్యల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్వాడీ సెంటర్లు, పాఠశాలలకు వారం రోజుల పాటు కోడి గుడ్ల సరఫరా నిలిపివేసినట్లు కమిషనర్ వెల్లడించారు. పట్టణ ప్రజలు బర్డ్ ఫ్లూ నివారణ అయ్యేదాకా కోడి మాంసం, కోడిగుడ్లను మానేయాలని సూచించారు.

టైలర్ల సమస్యలపై వినతి

ముమ్మిడివరం: ఎమ్మెల్యేతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా మంగళవారం డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా టైలర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ కార్యవర్గ సభ్యులు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిసి టైలర్స్ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. టైలర్ ఫెడరేషన్ పునరుద్ధరణ వంటి పలు సమస్యలను ఎమ్మెల్యే బండారుకు విన్నవించారు. ఎమ్మెల్యే బండారు సానుకూలంగా స్పందిస్తూ త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో చర్చించేందుకు సుముఖత చూపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జక్కంశెట్టి స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మూర్తి, జిల్లా మహిళా అధ్యక్షురాలు గొలుగూరి వసంతలక్ష్మి, అడపా లక్ష్మి, కడలి వెంకటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

17న ప్రజ్ఞా సాహితీ వార్షికోత్సవం


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రతినిధులు

ఐ.పోలవరం: వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ ప్రజ్ఞా సాహితీ వార్షికోత్సవాన్ని ఈ నెల 17వ తేదీన పశువుల్లంకలో నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి రేవు అప్పలస్వామి మంగళవారం తెలిపారు. కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు, వెంకటరావు, వరలక్ష్మి, వాసంశెట్టి శ్రీరామమూర్తి, అడ్డగల్ల రాంప్రసాద్, సలాది సత్యనారాయణ, కడలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడికి సత్కారం


ఖాదర్‌ను సత్కరిస్తున్న ముస్లిం ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్‌ను వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా పార్టీ కేంద్ర కార్యాలయం నియమించడంతో స్థానిక శ్రీరామపురంలో ముస్లిం పెద్దలు మంగళవారం సత్కరించి అభినందించారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు రెండో సారి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్ష పదవి ఇచ్చినందుకు మరింత కష్టపడి పని చేస్తానని ఖాదర్ అన్నారు. హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌస్ లాజమ్, అనంతపురం, కడప జిల్లాల వక్ఫ్ బోర్డుల మాజీ చైర్మన్లు ఖాగజ్ ఘర్ రిజ్వాన్, మదీనా దస్తగిర్ తదితరులు ఖాదర్‌ను సత్కరించి అభినందించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లి బొంతువారిపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన ఐదు కుటుంబాలకు సాయం అందించేందుకు యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ ముందుకు వచ్చింది. బాధితులకు నిత్యావసరాలు, ఇతర సామగ్రిని అందించారు. బాధితులు కుంచే మరియమ్మ, గూటం ఇంద్రాణి, దాకే మంగాయమ్మ, మంగం నరసింహమూర్తి కుటుంబాలను వైఎంసీఏ అధ్యక్షుడు డాక్టర్ ఎం.బాలస్వామి, కార్యదర్శి డాక్టర్ యాళ్ల తీమోతి శామ్యూల్‌రాజు పరామర్శించి ఈ సాయాన్ని అందించారు. కార్యక్రమంలో సభ్యులు గెల్లా కృపావరం, విప్పర్తి శాంతి ప్రకాష్, ఉండమాటి మణిప్రసాద్, పెరుమాళ్ల ప్రసాద్, సరాకుల గోపిరాజు, పోతుల ప్రభాకర్, కుమారి శాంసన్, యు.ప్రదీప్, మనిదీప్, గోసంగి ఆనందరావు, కడిమి అర్జున్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు

అమర గాయకుడు ఘంటసాల

అమలాపురం టౌన్: దుర్గా మల్లేశ్వరస్వామి కార్పెంటర్, చేతి వృత్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘ కార్యాయంలో గాన గాంధర్వుడు ఘంటసాల వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. ఘంటసాల పాడిన మధుర గీతాలు నేటికీ శ్రోతల హృదయాలను పులకింప జేస్తున్నాయన్నారు. సంఘ కార్యదర్శి గున్నేపల్లి భీమ శంకరం, ప్రతినిధులు వెంకట సుబ్బరాజు, ఆకుల రామకృష్ణ, కొప్పనాతి తాతాజీ, కేతా సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరణించి.. మరొకరికి చూపునిచ్చి..


నేత్రదానం చేసిన ఊడా జానకమ్మ

తాళ్లరేవు: పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామానికి చెందిన ఊడా జానకమ్మ మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ మృతురాలి కుమారుడు ప్రసన్నకు నేత్రదానంపై అవగాహన కల్పించి, కుటుంబ సభ్యుల అంగీకారంతో జానకమ్మ నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు అందజేశారు. ఐ బ్యాంక్ ప్రతినిధులు నానాజీ, నానీలు ఆమె కార్నియాలను సేకరించారు. నేత్ర దాత కుటుంబీకులను పలువురు అభినందించారు.

మాఘ పౌర్ణమికి విస్తృత ఏర్పాట్లు

యానాం: మాఘపౌర్ణమిని పురస్కరించుకొని గౌతమీ గోదావరి వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ తెలిపారు. మాఘ పౌర్ణమి స్నానాలకు వందలాదిగా తరలివచ్చే యానాం పరిసర ప్రాంతాల భక్తుల కోసం స్నాన ఘట్టాలు, మెట్ల వద్ద పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు.

రాజ రాజేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే

యానాం: స్థానిక రాజరాజేశ్వరీ సహిత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలు జరుగుతున్న సందర్భంగా ఆలయాన్ని సందర్శించి దర్శనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి రథయాత్రను నిర్వహించారు.

సబ్‌స్టేషన్ కార్యకలాపాలను పునరుద్ధరించాలి

తాళ్లరేవు: మండల పరిధిలోని ఇంజరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సెక్షన్ కార్యకలాపాలను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు. ఇటీవల ఇంజరం సబ్ స్టేషన్‌ను ప్రభుత్వం తాళ్లరేవు సబ్‌స్టేషన్‌లో విలీనం చేసింది. ఈ నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని ఏఈ, జేఈ, కంప్యూటర్ ఆపరేటర్‌లను వేరే ప్రాంతానికి తరలించారు. ఇకపై ఆయా సేవలకు సంబంధించి తాళ్లరేవు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లాల్సిందే. దీంతో ఇంజరం సబ్‌స్టేషన్ పరిధిలోని పిల్లంక, ఇంజరం, సుంకరపాలెం, లచ్చిపాలెం, ఉప్పొంగల, నీలపల్లి, జార్జీపేట గ్రామాల ప్రజలు ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రానికి సుమారు పది కిలోమీటర్ల పైనే ప్రయాణించాల్సి ఉంటుందని, రెండు బస్సులు, ఆటోలు మారాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏదైనా సమస్య ఉంటే ఇంజరం సబ్‌స్టేషన్‌కి వెళ్లి తక్షణమే పరిష్కరించుకునే వాళ్లమని, తాళ్లరేవు వెళ్లాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని అని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని స్థానిక నాయకులు వేలూరి కాశిబాబు తదితరులు కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. దీనిపై ఇంజరం విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ టీవీవీ సుబ్రహ్మణ్యాన్ని వివరణ కోరగా విలీన చర్యల్లో భాగంగా ఇంజరం సెక్షన్ కార్యకలాపాలను తాళ్లరేవు కార్యాలయానికి బదిలీ చేశారన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలుంటే 94440812639 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పీడీ నాగదుర్గకు సత్కారం

అమలాపురం టౌన్: కాకినాడలో ఈ నెల 8, 9, 10వ తేదీల్లో జరిగిన ఏపీ స్టేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (పీఈటీ), ఫిజికల్ డైరెక్టర్ల (పీడీ) సెమినార్ కమ్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీల్లో అమలాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పీడీ వి.నాగదుర్గ పలు క్రీడల్లో విజేతగా నిలిచి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి అధ్యక్షతన మంగళవారం జరిగిన అభినందన సభలో పీడీ నాగదుర్గ క్రీడా ప్రతిభను ఉపాధ్యాయులు ప్రశంసించారు. ఆమెను ఘనంగా సత్కరించారు.

దివ్యాంగులకు ఉపకరణాల అంచనా శిబిరం

యానాం: పుదుచ్చేరి సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన ఆల్కోమోకో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం సావిత్రీనగర్, గిరియాంపేట, దరియాలతిప్ప, దొమ్మేటిపేట గ్రామాలకు చెందిన వారికి అంచనా శిబిరాన్ని నిర్వహించారు. అధికారి చింతా రామజోగి, ఆల్కోమోకో సంస్థ సిబ్బంది డాక్టర్ జి నాయక్, డాక్టర్ ఎస్ షాహు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సభ్యులకు అవగాహన

కాట్రేనికోన: స్థానిక యూనియన్ బ్యాంకులో మేనేజర్ మోహన్ అధ్యక్షతన మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘ సభ్యులను ఆర్థిక స్థితిమంతులుగా చేయాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న రుణం పథకంపై అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ జయ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఓఏలు, బ్యాంకు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

యానాం: బాలల హక్కుల పరిరక్షణను అందరి బాధ్యతగా భావించాలని ప్రముఖ న్యాయవాది కమిడి విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూనిట్-1,2 ల ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శాంతికుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు సీహెచ్ నరేష్, ఎస్ శ్రీనివాస్, అధ్యాపకుడు తాతపూడి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

అమలాపురం రూరల్: మండలంలో పాత బండారులంకలోని భువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో మాఘ శుద్ధ చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో ఆలయ పూజారులు పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యంలో పాల్గొన్నారు.

జిప్‌మెర్ డైరెక్టర్‌తో మల్లాడి భేటీ

యానాం: పుదుచ్చేరి జిప్‌మెర్ ఆసుపత్రి నూతన డైరెక్టర్‌గా నియమితులైన నేగీతో మంగళవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమావేశమయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేగీని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రిలో ప్రస్తుతం అందుతున్న ఓపీ సేవలతో పాటు ఇన్‌పేషెంట్ సేవలను ప్రారంభించాలని కోరారు.

ఫైర్ డిపార్ట్‌మెంట్ ఫలితాల విడుదల

యానాం: పుదుచ్చేరి అగ్నిమాపకదళ శాఖలో ఖాళీగా ఉన్న 58 ఫైర్‌మెన్(లెవెల్-2) పోస్టుల భర్తీకి ఈ నెల 10న ఆదివారం నిర్వహించిన రాత పరీక్షకు సంబంధించి ఫలితాలను మంగళవారం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పంకజ్‌కుమార్ ఝా విడుదల చేశారు. యానాం నుంచి కర్రి రవివర్మ(62.50 మార్కులు) ఈడబ్ల్యూఎస్ విభాగం నుంచి మల్లిపూడి ప్రసాద్(38.00 మార్కులు), కేశవశ్రీ సాయి మానేపల్లి(37.50 మార్కులు), ముద్రగడ రామగోవింద్(35.25 మార్కులు) సాధించారు. వెయిటింగ్ లిస్టులో మరో ఇద్దరు ఉన్నారు.